క్లుప్తంగా

మంత్రి సీతక్కకు అభినందనలు


పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

సాలూరు: గిరిజన బిడ్డ దనసరి అనసూయ (సీతక్క) తెలంగాణ రాష్ట్ర గిరిజన శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆంధ్రా ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యురాలిగా ఉన్నప్పటి నుంచి సీతక్క తనకు పరిచయమని గుర్తు చేశారు. ఆమె భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో బహుళ ఏకాదశి పూజలు


సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

సాలూరు: కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా పట్టణం, మండల పరిధిలోని పలు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పంచముఖేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి, కామాక్షమ్మ, తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అలాగే పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్ర కల్యాణ మంటపంలో ఉయద భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో 115 మంది దంపతులచే సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

పంట నష్టంపై ఆరా...


కూర్మరాజుపేటలో రైతులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఓ అనురాధ పండా, తదితరులు

సాలూరు: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో పాడైన పంటలను వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఓ అనురాధ పండా, తదితరులు శుక్రవారం పరిశీలించి, పంట నష్టంపై ఆరా తీశారు. కూర్మరాజుపేటలో వారు పర్యటించి, బాధిత రైతులతో మాట్లాడారు. వరి, మొక్కజొన్న పొలాల్లో ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, మండలంలో 182 మంది రైతులకు సంబంధించిన 194 ఎకరాల్లో వరి.. 19 మంది రైతులకు సంబంధించిన 22 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు.

పార్వతీపురం పట్టణ ఎస్సై బాధ్యతల స్వీకరణ


టౌన్ ఎస్సై సంతోషి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ ఎస్సైగా సంతోషి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆమె పార్వతీపురం మన్యం జిల్లా దిశ ఉమెన్ సెల్‌లో ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు పార్వతీపురం టౌన్ ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన బి.లావణ్య జిల్లా దిశ ఉమెన్ సెల్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్సై సంతోషి మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పార్వతీపురం: పార్వతీపురం జిల్లా కోర్టులో శనివారం (డిసెంబర్ 9వ తేదీన)జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రెండవ అదనపు జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.దామోదరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రకాలైన సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేస్తారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుని వారి సమయాన్ని, డబ్బును ఆదాచేసుకోవాలని సూచించారు.

సచివాలయాలకు చేరుకున్న క్రీడా పరికరాలు


సచివాలయ ఉద్యోగులకు క్రీడా పరికరాలను అందిస్తున్న రంగునాయుడు

మక్కువ: ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించిన క్రీడాపరికరాలు సచివాలయాలకు చేరుకున్నాయి. శుక్రవారం స్థానిక ఎస్ఎన్ పాఠశాలలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ చేతుల మీదుగా సచివాలయ ఉద్యోగులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు మాట్లాడుతూ, ఈ నె 15 నుంచి జరగనున్న క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమంలో సరికొత్త చరిత్ర

- ఎమ్మెల్యే జోగారావు


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే జోగారావు, నాయకులు

బలిజిపేట: రాష్ట్రంలో అన్ని వర్గాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమఫలాలను అందించి ఏరాష్ట్రంలోనూ లేని సరికొత్త చరిత్రకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురం సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే? కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించి చరిత్ర సృష్టించిన నాయకుడు రాష్ట్రానికి అవసరమా? కాదా? అనేది ప్రజలే గుర్తించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. అటువంటి నాయకుడినే మళ్లీ సీఎంగా చేసుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సుమలత, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ నాగమణి, ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, జేసీఎస్ కన్వీనర్ శ్రీరాములునాయుడు, మండల వ్యవసాయసలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, మాజీ జెడ్పీటీసీ ఎం.రాధ, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.అప్పన్న, ఎం.శ్రీనివాసరావు, అజయ్, ఎం.శ్రీరామూర్తి, జి.జగన్, జి.సత్యం నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్‌నెస్ భవనం ప్రారంభం

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో రూ.17.50లక్షలతో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.

మున్సిపాలిటీలో వేగవంతంగా అభివృద్ధి పనులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉన్న పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని, అలానే చేపట్టాల్సిన అత్యవసర అభివృద్ధి పనులను కూడా సత్వరమే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి, కమిసనర్ జె.రామప్పల నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్‌లు, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు


సీతానగరం: సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జెడ్పీటీసీ ఎం. బాబ్జీ తదితరులు

ఉపాధి పనులు వేగవంతం

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


మంత్రి రాజన్నదొరతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

సాలూరు: జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులు వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. డ్వామా పీడీ రామచంద్రరావు మంత్రి రాజన్నదొరను శుక్రవారం అతని స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. దీనికి పీడీ స్పందిస్తూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సాలూరు నియోజకవర్గానికి 706 పనులను ప్రతిపాదించగా.. 703 పనులకు ఆమోదం వచ్చిందన్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు..

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణి మంత్రిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పీడీతో మంత్రి చర్చించారు. ఎక్కడా ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పనిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సత్యవతి ఉన్నారు. అనంతరం పీడీ పట్టణంలోని వైటీసీలో ఏర్పాటుచేసిన గర్భిణుల వసతిగృహం, 29వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

రైతులు, హమాలీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలపరిధిలో ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించి మిల్లులకు మాత్రమే ట్యాగింగ్ చేయాలని, రైతుల ధాన్యం, గోనెసంచులు, హమాలీల నగదు త్వరితగతిన జమయ్యేలా చూడాలని వ్యవసాయ సలహా మండలి సభ్యులు కోరారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు బి.శ్రీరాములునాయుడు, ఎం బాబ్జీ, జి శంకరరావు అడిగిన ప్రశ్నకు ఏఓ ఎస్.అవినాష్ సమాధానమిస్తూ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నామని, మండల పరిధిలోని మిల్లులకు ట్యాగింగ్ అయిందని తెలియజేశారు. ధాన్యం కొనుగోలుకు ఈసంవత్సరం రూ.2183 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మించాంగ్ తుఫాన్ కారణంగా కుప్పలుగా వేసుకున్న పంటను ఎండలో ఆరబెట్టి కొనుగోలుకు సిద్ధం చేయాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఒకవేళ పనలు ఏమైనా తడిచినా వాటికి ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవడం వల్ల తడవడం వల్ల వచ్చే నష్టాన్ని తగ్గించవచ్చని రైతులకు హితవు పలికారు. కార్యక్రమంలో సలహా మండలి సభ్యులు, పీఏసీఎస్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు


ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు వయస్సు పూర్తి చేసుకున్న వారందరికీ ఓటు హక్కుకల్పించనున్నామని, అందుకు అవసరమైన దరఖాస్తులు బీఎల్వోలు, వీఆర్వోలు, సచివాలయాల్లో లభ్యమవుతాయని తహసీల్దార్ ఎన్వీ రమణ చెప్పారు. ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు తదితర అంశాలపై బీఎల్‌ఓల ద్వారా వచ్చిన దరఖాస్తులను పోలింగ్ స్టేషన్ల వారీగా శుక్రవారం సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జానుమల్లువలస పోలింగ్ కేంద్ర వద్ద మాట్లాడుతూ మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఇటీవల స్వీకరించిన ఓట్ల నమోదు దరఖాస్తులతో పాటు దీర్ఘకాలంగా గ్రామాంతరం వెళ్లినవారు, మృతిచెందిన వారి కుటుంబీకుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు బీఎల్వోల ద్వారా వచ్చిన దరఖాస్తులపై పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలిస్తున్నామని ఆ సమయంలో ఎటువంటి ఆక్షేపణలున్నా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయడానికి ప్రజలందరి సహకారం తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో పోలింగ్ కేంద్రం సూపర్‌వైజర్ సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, బీఎల్వోలు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి..

- వైఎస్సార్‌సీపీ నాయకులు


సాలూరు: పట్టుచెన్నూరు వద్ద డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, తదితరులు

సాలూరు: రాష్ట్రంలో ప్రస్తుత సంక్షేమ, సువర్ణయుగ పరిపాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్ కోరారు. మండలంలోని గిరిశిఖర గ్రామమైన పట్టుచెన్నూరు సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాను గుర్తించాలి

పార్వతీపురంటౌన్: సికిల్‌సెల్ ఎనీమియాను గుర్తించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా హాజరైన ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని త్వరితగతిన గుర్తించడం వల్ల ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చన్నారు. ర్యాపిడ్ టెస్ట్ కిట్ల ద్వారా వ్యాధిని గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డీఎంహెచ్‌ఓ బి. జగన్నాథరావు మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియాపై శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రస్థాయి స్క్రీనింగ్ టెస్ట్ బృందం విచ్చేసిందని చెప్పారు. రక్తహీనత, అలసట, బలహీనత, కళ్లు, చర్మం, పసుపురంగుగా మారడం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది తదతర లక్షణాల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ బి.భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్, విజయపార్వతి, ప్రోగ్రాం అధికారులు, టి. జగన్‌మోన్‌రావు, ఎం.వినోద్ తదితరులున్నారు.

పాత్రికేయులపై విద్యుత్ ఈఈ దుర్భాషలు

పార్వతీపురంటౌన్: వార్తల సేకరణకు వెళ్లిన ముగ్గురు పాత్రికేయులపై విద్యుత్ శాఖ ఈఈ వీవీ కిశోర్ దుర్భాషలాడారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పదోన్నతి, బదిలీకి సంబంధించి తనకు అన్యాయం జరిగిందని విద్యుత్‌శాఖ యూనియన్‌లో ఉన్న ఉద్యోగి జె.ఆనందరావు కార్యాలయం ఆవరణలో ఈఈ కారు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పాత్రికేయులు వివరణ అడిగేందుకు వెళ్తుండగా పాత్రికేయులపై ఈఈ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడారు. దీంతో ఈఈ క్షమాపణ చెప్పాలని పాత్రికేయులు కార్యాలయం బయట నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు పాత్రికేయులు, ఈఈని పిలిచి చర్చించారు. అనంతరం ఈఈపై పాత్రికేయులు ఫిర్యాదు చేశారు.

పీహెచ్‌సీలో నేత్ర వైద్య శిబిరం రేపు


సీహెచ్‌ఓ ఎన్వీ రమణ

సీతానగరం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రభుత్వ నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎన్వీ రమణ తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో కంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని కంటి వ్యాధిగ్రస్థులు వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 96661-66675 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భూ హక్కు చట్టం రద్దు చేయాలని ఆందోళన

పాలకొండ: ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ భూ హక్కుల చట్టం రద్దు చేయాలని న్యాయవాదులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కోర్టు ఆవరణలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది మురళీమోహనరావు మాట్లాడుతూ న్యాయ పరిధిలో లేకుండా రాజకీయ జోక్యం ఎక్కువగా ఉన్న ఈ చట్టం రద్దు చేయాలని కోరారు. ఈ చట్టంతో ప్రజలకు నష్టం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొర్ల సత్యం నాయుడు, బలగ నరసింహారావు, సీమల కృష్ణారావు, బత్తిన మోహనరావు, బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్రా క్రీడల కిట్‌ల పంపిణీ


ఆడుదాం-ఆంధ్రా క్రీడల కిట్‌లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీడీఓ. ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్రా క్రీడపోటీలను యవతీ యువకులు విజయవంతం చేయాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌లు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండలంలోని సచివాలయాల కార్యదర్శులకు ఆడుదాం-ఆంధ్రా క్రీడల కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్యపఠనం ధారణ శక్తికి మూలం


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకేశవరావు

పార్వతీపురం: విద్యార్థుల్లో ధారణా శక్తిని పెంపొందించేందుకు పద్యపఠనం మూలమని సంగంవలసలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.ప్రశాంతి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాలలో విద్యార్థులకు పద్యపఠన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శివకేశవరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఒక ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సంగంవలసలో స్వయంగా ఒక ప్రజా గ్రంథాలయం ఏర్పాటు చేసుకుని గ్రామం ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం పద్యపఠన పోటీల్లో విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్థానికుడు బి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మెరుగుపర్చుకోవాలి : పీడీ


మొబైల్ సేల్స్ అండ్ సర్వీసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్

గుమ్మలక్ష్మీపురం: పీఎంఈజీపీ ద్వారా పొందిన రుణంతో స్వయం ఉపాధి మెరుగుపర్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన సాయిబాబా మహిళ సంఘం సభ్యురాలైన సుగ్గు పార్వతికి పీఎంఈజీపీ ద్వారా 35 శాతం సబ్సిడీపై రూ.4 లక్షలు మంజూరు కాగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పింది. మద్ది గీతకు మంజూరైన 35 శాతం సబ్సిడీపై రూ.16 లక్షలు రుణం మంజూరు కాగా మొబైల్ సేల్స్, స్పేర్స్ అండ్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుంది. ఈ మేరకు ఈ రెండు యూనిట్లను శుక్రవారం పీడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ యూనిట్లను సక్రమంగా నిర్వహిస్తూ జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని సూచనలు చేశారు. ఆయన వెంట వైకేపీ ఏపీఎం ఆదయ్య, సీసీ పైడా నాగేశ్వరరావు తదితరులున్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన


వివిధ ఆకృతుల్లో వెలుగుతున్న దీపాలు

మక్కువ: కార్తీకమాసం బహుళ ఏకాదశి సందర్భంగా సహస్ర దీపారాధన, నదీ హారతుల కార్యక్రమం శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవారి ఆలయం మంటపంలో ఓంకారం, శివలింగం, స్వస్తిక్, తదితర ఆకృతులలో దీపాలు వెలిగించారు. అనంతరం నది వద్దకు వెళ్లి నదీ హారతులిచ్చారు. విజయనగరానికి చెందిన బ్రహ్మశ్రీ కె.శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పూడి దాలినాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ, ధర్మకర్తలు, మాజీ చైర్మన్ గంజి కాశినాయుడు, తీళ్ల శ్రీరాములునాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

300 లీటర్ల సారా స్వాధీనం


జియ్యమ్మవలస: పట్టుకున్న సారాతో ఎస్‌ఈబీ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సారా స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ముందస్తు సమాచారం రావడంతో చినమేరంగి పోలీసులతో కలిసి దాడిచేసినట్లు ఎస్ఈబీ కురుపాం ఎస్సై బీవీ నాగభూషణరావు తెలిపారు.ఈ దాడులలో ఇద్దరు వ్యక్తుల నుంచి 300 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో డీటీఎఫ్ ఎస్సై జె.రాజశేఖర్, ఎం.రవిప్రసాద్, చినమేరంగి పోలీసులు పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి


విద్యార్థుల చదువులు పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సకాలంలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాల సిలబస్ పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి చదువులు పరిశీలించారు. సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు పాల్గొన్నారు.